ఇచ్చినా, యే కార్ల కంపెనీలో భాగం పెట్టినా కట్నంకన్న ఎక్కువగా ఉంటుంది" అని మరికొందరు సర్ది చెప్పచూశారు. ఆడవాళ్ళ విడ్డూరానికి అంతు లేదు.

ఏమైతేనేం పెళ్ళి మహావైభవంగా జరిగిపోయింది. శివరామారావుగారు వివాహమైన రెండు నెలల అనంతరం అల్లుడుకి మోటారు సైకిలు, రేడియో, గడియారం యిత్యాదులు అందరికీ ఘనంగా కనబడే వస్తువులు యిచ్చారు. సోమసుందరయ్యగారు, ఆయనగారి భార్య తమ వియ్యంకుడు అల్లుడికి పెట్టడం దీనితో ఆరంభమైనట్టు సంతోషపడసాగారు.

* * *

సోమనాథం బి. ఏ. మొదటిభాగం చదువుతున్నాడు, భార్య కాపరానికొచ్చి. రెండు సంవత్సరాలైంది. సోమనాథం బి. ఏ. ప్యాసయ్యాడు. ఒక కొడుకుపుట్టాడు. కాని యింతవరకు శివరామారావుగారు కట్నంరూపంలో దమ్మిడీ యివ్వలేదు. అప్పుడుయిచ్చిన మోటారు సైకిల్, రేడియో, గడియారమే సోమసుందరయ్యగారు యింకా ఆశపెట్టుకున్నారు. ఆయనగారు భార్యతో కోడలిదగ్గర యీ కట్నం విషయం మరిచిపోయికూడా అనవద్దని కట్టుదిట్టంచేశారు. సోమనాథం ఉద్యోగం లేక బి. ఏ. డిగ్రీ పుచ్చుకు కూర్చున్నాడు. సినిమా హాలు మేనేజరుగానో, లేక మిల్లు మేనేజరుగానో, లేక కార్లకంపెనీ ప్రొప్రైటరుగానో తనని చేయగూడదూ మామగారు- అని చాలాసార్లు అనుకున్నాడు సోమనాథం. ఆ మాటకొస్తే సోమసుందరయ్యగారుకూడా చాలాసార్లు యిలాగే భావించారు. కాని శివరామారావుగారు అదేమీ గమనించలేదు. సోమనాథం భార్య యీవిషయం తండ్రికి చెప్పలేదు. అసలు సోమనాథానికి ఈ విషయం మామతో చెప్పమని భార్యతో అనే తాహతులేదుగా.

శివరామారావుగారికి పక్షవాతం ప్రవేశించింది. ఇహ తను బ్రతికినా బ్రతికినట్టు లెక్కకాదని తన యిద్దరు కొడుకులకి వ్యాపారంఅంతా అప్పచెప్పాడు. అప్పుడైనా సోమనాథానికి ఉద్యోగం తన కంపెనీల్లో యిచ్చేందుకు అవకాశం శివరామారావుగారు కల్పించలేదు. సోమనాథం నోరుతెరచి అడగనూ లేదు.

ఇంకా సోమసుందరయ్యగారికి వియ్యంకుడు వరకట్నంక్రింద యేదో ఒక మొత్తం ఏదో ఒక రూపంగా తప్పకుండా యిస్తాడనే ఆశ యెందుకుందో ఎవరికీ అర్థంకాలేదు.

స్కెచ్

# సమ్మె కట్టిన గుమస్తాలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

లింగమూర్తి ఎంతో వినయంగా వంగి నమస్కరించాడు మేనేజరు ముందునిలబడి.

తలెత్తి చూసి మళ్ళీదించుకుని "కూర్చోవయ్యా! ఏం మళ్ళీ యేదైనా తగాదా లేవదీశావా?"—విసుగ్గా ప్రశ్నించాడు

"తగాదా యేముంటుందండీ! ఇదివరకు మనవి చేసుకున్నదే! జీతాలు అందరికీ పదిహేనేసి రూపాయల చొప్పున ఎక్కువ చేస్తామని ఏడాది క్రిందటే మాటిచ్చారు కాని—"

"జీతాలు, జీతాలు! ఎప్పుడూ యిదేగోడవా మీకు! అసలే మా వ్యాపారం దివాలాగా వుంటేను!"

"చిత్తం! ఈ మాట రెండేళ్లనుంచీ అంటున్నారు."

"అవునయ్యా! నిజమే! ఇందులో అబద్ధం యేముంది! నువ్వు చూడటంలేదూ! ప్రదర్శించేవన్నీ చెత్తచిత్రాలు. దమ్మిడీ కలెక్షన్ రావడం లేదు. పైగా యీ రిప్రజెంటేటివ్‌లు లాగ్ కాజేస్తున్నారు మధ్యలో"

"ఆ సంగతి ఎలా వున్నప్పటికీ మాకు అనవసరం. తమ వ్యాపారానికి నష్టమేమీ రావటం లేదు. ఈమధ్య వచ్చిన రెండు తెలుగుచిత్రాలు తమరేగా రిలీజుచేసింది! నెలలతరబడి ఆడాయి, డబ్బు ఒకటికి పదిరెట్లు లాభం వచ్చింది. మాకు

బోనస్ కూడా యివ్వడం లేదు. వేతన ఎనభై రూపాయలతో ఎలా గడపమంటారు?"

"మీరెలా గడుపుతుంటే నాకే! ప్రొప్రయిటరుగారు దమ్మిడీ ఎక్కువ చెయ్యొద్దని ఖచ్చితంగా చెప్పారు. మూడేళ్లు దాటితే వీలుగా వుంటే చూస్తాం."

"తమరలా సెలవిస్తే ఎలా! ప్రఖ్యాతఫిలిం డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ తమరిది విపరీతమైన లాభాలు గడించారు. తమరిదయవల్ల యిద్దరు నిర్మాతలు మళ్ళీ ఎక్కడా సినిమా రంగంలో కనిపించలేదు. ఇన్‌కంటాక్సు ఆఫీసర్లు రేడియోలు, మోరిస్ మైనర్లు కొనుక్కున్నారు యీ ఎనిమిదేళ్లలో."

"అనవసర ప్రసంగం! ఇక కట్టిపెట్టు నోరు."

"పనితో సహా కట్టిపెట్టేస్తాం నోళ్లు" వుత్సాహంగా అన్నాడు లింగమూర్తి.

"పొండోయ్! మీ గుమాస్తా లేంచేస్తారు! ఒక్కపూట కాలితే పరుగెత్తుకొస్తారు పనిలోకి! ఆ 'శాంతి' చిత్రంలో చూడం గుమాస్తాలకు నోరు లేదని చూపించాడు. మిల్లుకార్మికులు ఎంత వుద్రేకంతో లేచారో చూశావా! ఇదంతా యెందుకు, రేపు సాయంత్రానికల్లా మీరే పొట్ట చేత్తో పట్టుకుని వస్తారు."

"చిత్రం ఆ నిర్మాతతోపాటు తమకికూడా వొకసారి మా గుమాస్తాలశక్తి చూపిస్తాం" వుద్రేకంతో అనేసి వెళ్ళిపోయ్యాడు లింగమూర్తి.

* * *

సమ్మె ప్రారంభమైంది. పదిహేను రోజులు గడిచాయి. సమ్మె చేస్తున్నవారి సంఖ్య మొత్తం పదహారు అంటే గుమాస్తాలు, టైపిస్టులు, ఎక్కౌంటెంట్, అసిస్టెంటుమానేజరు, అందరూ కలుపుకొని. ప్రముఖ పత్రికలన్నీ యీ వార్త ప్రకటించాయి. కాని వొక్కటి కూడా యీ సమ్మెను బలపరుస్తూ సంపాదకీయం వ్రాయలేదు. ఏ పార్టీతోనూ సంబంధంలేని కొంత వారపత్రికలు మాత్రం బలపరుస్తూ వ్రాశాయి. గుమాస్తాలు కొందరు మలమల మాడిపోయారు. జేబులో దమ్మిడీ లేక నిధి వసూలు చెయ్యడం ప్రారంభించారు. రోజుకు సగటున నాలుగు రూపాయలకన్నా యింకా తక్కువే వొచ్చింది. సమ్మె ప్రారంభమై నెల రోజులైంది లింగమూర్తిమీద మిగతావారంతా ప్రశ్నలవర్షం కురిపించారు. ఏ పార్టీనైనా అండగా పెట్టుకుంటే బాగుంటుందని ఒకాయన సలహా యిచ్చాడు.

అప్లికేషనులు తెగవచ్చిపడ్డాయి వుద్యోగాల కోసం. వారం రోజులలోగా చేరకపోతే వుద్యోగాలు పోతాయని మేనేజరు నోటీసిచ్చాడు లింగమూర్తికి. గుమాస్తాలు చలించలేదు. ధైర్యంగా ఆఫీసుముందు నిలబడి ఒక్కరిని కూడా కొత్తవాళ్ళని లోనికి పోకుండా కాళ్ళమీదపడి ప్రతిమాలి పంపించేశారు. ఆఫీసుముందు గల్లంతు చేస్తున్నారని పోలీసుల్ని పిలిపించాడు ప్రొప్రయిటరు. కాని గుమాస్తాలు కదల్లేదు. బరబర యీడ్చేసి పోలీసులు అడ్డం నుంచున్నారు ఆఫీసుముందు. గుమాస్తాలు ఆలోచించి నాలుగు జట్లులుగా చీలి, ఆఫీసుకు కొంచెం దూరంగా నాలుగురోడ్ల చివర నుంచున్నారు మొహాలు కనిపెట్టి, "మీరుద్యోగంకోసం వెళుతున్నారా! అయితే, మా శరీరాలమీద తొక్కుకుంటూ వెళ్ళండి, మా భార్యాబిడ్డల్ని మీ చేతుల్తో నరికేసెయ్యండి. లేదా వెనక్కి తిరగండి" అని దీనంగా ప్రతిమాలుకున్నారు. ఎవ్వరూ ధైర్యం చెయ్యలేదు ముందుకెళ్ళటానికి.

* * *

సాయంత్రం అయింది. లింగమూర్తి యింటి అరుగుమీద గుమాస్తాలు నలుగురూ, లింగమూర్తీ కూర్చుని వున్నారు. కారాగింది. మేనేజరు దిగాడు. లింగమూర్తి స్వాగతమిచ్చాడు. మేనేజరు కుర్చీలో కూర్చున్నాడు. గుమాస్తాలు అరుగుమీద కూర్చున్నారు. అందరి కళ్ళూ మేనేజరు వైపే వున్నాయి. మేనేజరు మొదలెట్టాడు:

"రేపటితో మీకు గడువు తీరుతుంది. ఉద్యోగాలు పోతాయి. తరువాత ట్రిబ్యునల్ కు మీరు అప్పీలు చేస్తే చేసుకోవచ్చు. కాని యీ పదేళ్లనుంచీ మీరంతా మా ఆఫీసులోనే పని చేస్తూ వుండడంచేత మన ప్రొప్రైటరుగారు రాజీ మార్గం సూచించారు. మీ కిష్టమేనా?"

"సెలవివ్వండి. ఆలోచిస్తాం" లింగమూర్తి తీవిగా జవాబు చెప్పాడు.

"అలా ఐతే ఇదీ మార్గం: సమ్మె కాలంలో జీతాలివ్వం. మీరడిగిన పదిహేను రూపాయల ఇంక్రిమెంటు యిస్తాం. ఏడాదికి నెలజీతం బోనస్ యిస్తాం అదీ!" లింగమూర్తి సందిగ్ధంలో పడ్డాడు. "ఆలోచించి రేపు ప్రొద్దున్నే చెప్తాం" అన్నాడు. మేనేజరు వెళ్ళాడు.

అంతా ఆలోచన మొదలెట్టారు. "ఒక్క నెలేగా పోయేది! మొండికేస్తే అసలు పోతుంది. గ్రుడ్డిలో మెల్ల వొప్పుకుందాం" నలుగురూ నిర్ణయించారు. లింగమూర్తి విధిలేక తలూపాడు.

మర్నాడు యథాప్రకారం ఆఫీసుపని సాగిపోతోంది. టైపురైటర్లు మోగుతున్నాయి. గుమాస్తాల నోట్లోనుంచి సన్నగా ధ్వని వెలువడుతోంది లెక్కల కూడికలు తీసివేతలు, మొదలైన వాటి బాపతు. "అబ్బ, వెధవరోద! నిమ్మళంగా బుర్రతో పని చేసుకోలేరూ" లింగమూర్తి విసుగ్గా నవ్వుతూ అన్నాడు.

రెండోరోజు పత్రికల్లో పడ్డది సమ్మె సంగతి. "మా పార్టీ సహాయాన్ని తీసుకుంటే ఘన విజయం సాధించేవారు. లింగమూర్తిలాంటి కనపడని పెట్టుబడిదారీ ఏజెంటుంటే సమ్మె ఎలా విజయవంతమౌతుంది?" ఒక పార్టీ పేపరు సంపాదకీయం వ్రాసింది.

# కరువు కత్తెరలు

చితికిపోవు మా రాయలసీమ; బ్రతుకు
పేజీపై; మొండివడిన అంపెరాత
నరనరాల తరలిపోయే నిప్పుపోత
మానవత్వమున మానని గుండెకోత
  భావి శిఖల కెగురబోయి కుప్ప పడుచు
  తునిగిపోవు పాపల పసి రెక్కలు
  భూతవర్తమాన సంధి నిరుక్కనుచు
  చినిగిపోవు యువకుల మసి డొక్కలు
గుండెల్లో జీవతైల మొండిపోవ
మండిపోయెరా ఆకలి దివిటీలు
నరాల్లో పరచిన నెత్తురు తెరల
కత్తిరించెరా కరువు కత్తెరలు
కళాహృదుల నద్దుకొన్న దివ్య "రత్న
గర్భం"లో విచ్చె విసపు వెఱ్ఱి పుచ్చ
చిరవాసనలెన్నో రుద్దుకొను చరిత్ర
గాత్రంలో పూచిందొక నల్లమచ్చ
  చెవిటివిరా చిలుమెక్కిన ధనం చెవులు
  మూగవిరా బిరుసెక్కిన 'గద్దె' నోళ్లు,—
  పుడమియెడద మ్రింగివేసె మంచినీళ్ళ
  వృథా విడుతురేల? మొసలి కన్నీళ్ళ
అగ్నిరసం త్రాగి చావమంటారా?
నీటికణం గతికి బ్రతుకుమంటారా—
మృత్యు రథం క్రింద నలుగుమంటారా?
జీవపథం నీడల పొమ్మంటారా.

—సి. నారాయణరెడ్డి